క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీకి ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

పోరుమామిళ్ల : మండలంలోని గానుగపెంటలో సోమవారం జరిగిన శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీ కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొన్నారు. నూతన విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సింగల్‌విండో అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరి రాళ్లపల్లె నరసింహులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వారిని ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వీరభద్రుడు, యూత్ లీడర్ చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు

ప్రొద్దుటూరు : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టానుసారంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు సీఎం దావూద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభం కాకమునుపే 60 శాతం అడ్మిషన్లు చేశారన్నారు. విద్యార్థులకు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. నర్సరీ విద్యార్థులకే రూ.30వేల నుంచి రూ.40వేలు వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకులు



సుమన్‌కుమార్‌రెడ్డి



శశికుమార్

పోరుమామిళ్ల : సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలలో పోరుమామిళ్ల శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆల్‌ఇండియా ఇంజనీర్ విభాగంలో సుమన్‌కుమార్‌రెడ్డి 112 ర్యాంక్, శశికుమార్ 1122 ర్యాంక్ సాధించినట్లు కరస్పాండెంట్ పాండురంగారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విద్యార్థులను అభినందిస్తూ.. పరీక్షల్లో ప్రతిభ చూపిస్తున్నందుకు సవతోషంగా ఉందన్నారు.

గోవులను సంరక్షించాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ మల్లికార్జునరావు

ప్రొద్దుటూరు కల్చరల్ : గోవులను వధించకుండా వాటిని సంరక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ మల్లికార్జునరావు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంలో గోవులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. వాటిని వధించడం తగదన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధించడానికి అక్రమ రవాణాకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. గోవులను సంరక్షించేందుకు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు బద్వేలు నాగమునిరెడ్డి మాట్లాడుతూ గోవులను జాతీయ జంతువుగా ప్రకటించాలని, గోవులను సంరక్షించాలని తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, సేవా ప్రముఖ్ భవాని శంకర్ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామిల కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం 10 గంటలకు ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదిక పైకి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివార్లకు హనుమంత వాహనంపై గుడి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, అన్నప్రసాద దాతలు తోడేటి గంగయ్య, పెంచలమ్మ, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బద్వేలు అర్బన్ : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సి.ఇ.ఆర్.డి.యస్ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ పి.నరేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్.టి.సి. బస్టాండు ఆవరణలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలు, అవగాహనతో ఎయిడ్స్ వ్యాధిని దూరం చేయవచ్చని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని తెలిపారు. అలాగే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులైన గర్భిణుల నుంచి శిశువుకు వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్.ఐ.వి. సోకిన ప్రతి వ్యక్తికి ప్రభుత్వాసుపత్రిలోని ఏ.ఆర్.టి.సి. సెంటర్‌లో ఉచితంగా మందులు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐ.సి.టి.సి కౌన్సిలర్ శ్రీనివాసులు, ప్రాజెక్టు సిబ్బంది మాబుచాన్, వన్నూరమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు చింతల దానమ్మ

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయక మోసం చేసిన సందర్భంగా ఈనెల 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి మహిళలు తరలిరావాలని వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు చింతల దానమ్మ తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈనెల 4న ఏడాది అవుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయక ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు కొండా ధనలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడంపై వైఎస్సార్‌సీపీ బుధవారం నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వారు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, భరత్ కుమార్‌రెడ్డి, పాశం సురేష్, గోవిందు రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలు స్ఫూర్తిదాయకం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు : భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఆలోచనలు ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా యూనిట్ ఈసీ మెంబర్ గోనా జ్యోతిసురేష్ కుమార్ కొనియాడారు. స్థానిక ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా యూనిట్ కార్యాలయంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కార్యాలయంలో జరిగిన నెలవారి సమావేశం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర్ వర్మచే గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.దస్తగిరిరెడ్డి, కార్యదర్శి ఆర్.వెంకటయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు జి.నారాయణరెడ్డి, కోశాధికారి లక్ష్మన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.సుధాకర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సునీల్ కుమార్

మైదుకూరు : మేలైన సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఉద్యాన పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లాలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను సోమవారం మైదుకూరు మండలంలో నిర్వహించారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అధ్యక్షతన ఆదిరెడ్డిపల్లె, తిప్పిరెడ్డిపల్లె, జంగంపల్లె, విశ్వనాథపురం, కేశలింగాయపల్లె గ్రామాల్లో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సునీల్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర యాజమాన్య పద్ధతులైన విత్తన శుద్ధి, వేసవిలో లోతైన దుక్కులు, పంట సాగు సమయంలో లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టల వినియోగంతో ఉద్యాన పంటల్లో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని వివరించారు. జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. మండల పశువైద్యాధికారి సుధాకర్ పశుపోషణ యాజమాన్య పద్ధతులను తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గురించి సమగ్రంగా రైతులకు తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పథకాలు విత్తన పంపిణీ గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మట్టి నమూనాలు, ఎరువుల వినియోగం, సమగ్ర పోషక యాజమాన్యం గురించి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ అరటి, బొప్పాయి పంటల సాగులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు

బద్వేలు అర్బన్ : బద్వేలు అర్బన్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ముగ్గురిని సోమవారం బద్వేలు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ముకేష్ కుమార్ వారికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

మైదుకూరు : మద్యం సేవించి వాహనాన్ని నడిపిన కేసులో చెండ్రాయుడు అనే వ్యక్తికి సోమవారం మైదుకూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రూ.5వేలు జరిమానా విధించినట్టు అర్బన్ ఎస్ఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. గత నెల 16వ తేదీన వాహనాల తనిఖీలో మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన చెండ్రాయుడు మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు. జరిమానా కట్టకపోతే పది రోజులు జైలు శిక్ష అనుభవించాలని మేజిస్ట్రేట్ తీర్పు చెప్పినట్టు పేర్కొన్నారు.

డ్వాక్రా మహిళలకు లాభాలు ఎప్పుడిస్తారు?

ఖాజీపేట : డ్వాక్రా మహిళల పెట్టుబడితో మహిళా మార్టును ఏర్పాటు చేశారు.. ఆ మహిళా మార్టు నిర్వహణలో వచ్చిన లాభాలను సభ్యులకు ఎప్పుడు ఇస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్ పీవీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళా మార్టు ఏర్పాటు చేసేటప్పుడు పెట్టుబడి పెట్టిన అందరికీ లాభాలను పంచుతామని హామీ ఇచ్చారని అన్నారు. ఆ హామీతోనే మూల ధన నిధిని డ్వాక్రా సభ్యులు సమకూర్చడం జరిగిందన్నారు. 28, నవంబర్ 2022న ఏర్పాటు చేసిన మహిళా మార్టు మంచి లాభాలు వస్తున్నాయని అన్నారు. పెట్టిన పెట్టుబడి పోను నేటికి రూ. 11,83,349 లాభం వచ్చిందన్నారు. అలాగే మహిళా మార్టు నిర్వహణకు అయ్యే మూల ధనం ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి మహిళా సభ్యులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

• ఘనంగా జ్యోతుల జాతర



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, నాయకులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని తిరువేంగళాపురం పంచాయతీ ఎత్తిరాజుపల్లె గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించిన జ్యోతుల జాతరకు ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు సుభిక్షంగా ఉండాలని పాడి పంటలతో విరసిల్లాలని ఆయా గ్రామాలలో ప్రజలు జాతర కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ప్రజలంతా సుఖ శాంతులతో ఐక్యంగా మెలిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, జడ్పీటీసీ పోలిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు నరసింహ, జయరామిరెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, కుప్పాల రమణ, బి.కోడూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లి నరసింహులు, కౌన్సిలర్ ఓబుళరెడ్డి, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, రఘురామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం భూమిలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఓ, చైర్మన్

గోపవరం : మండలంలోని రూపరాంపేట శివాలయం భూమి కబ్జాకు గురైన విషయాన్ని తెలుసుకొని ఆలయ ఈవో, పాలకమండలి చైర్మన్ ఆక్రమణను తొలగించారు. ఆలయానికి సంబంధించి మడకలవారిపల్లె గ్రామ రెవెన్యూ పొలం 982/1, 982/2లో ఎ.9.72 సెంట్లు భూమి ఉన్నది. ఈ భూమికి సంబంధించి ఆలయ అధికారులు, పాలకమండలి చైర్మన్ హద్దులు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఇదే భూమిలో సోమవారం కొందరు వ్యక్తులు కబ్జా చేసి పునాదులు తీయించారు. విషయం తెలుసుకున్న ఈ.వో. రామలింగారెడ్డి, ఆలయ చైర్మన్ పాటూరు శివశంకర్‌రెడ్డి, ఆక్రమణకు గురైన ప్రాంతానికి వెళ్లి చదును చేయించారు. శివాలయం భూమి బద్వేలు మునిసిపాలిటీ పరిధిలో ఉండడంతో ఆక్రమణలు కూడా మితిమీరి పోతున్నాయి. స్థలాలకు విపరీతమైన డిమాండు ఉండటంతో సెంటు స్థలం కనిపించినా కబ్జాదారులు వదలడం లేదు. ఈ సందర్భంగా ఈ.వో, చైర్మన్ మాట్లాడుతూ శివాలయం భూమిలో ఎవరైనా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

హామీల అమలులో కూటమి విఫలం



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల : సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఇంటిస్థలం, బంజరు భూమి కోసం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో ఇంటికి 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు, 2 ఎకరాలు బంజరు కేటాయిస్తామని చేసిన ఎన్నికల వాగ్దానం నీటి మూటలేనా? అన్నారు. రెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, రైతులకు ఏడాదికి రూ. 20 వేలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి అమలు చేయక పోవడం దారుణమన్నారు. పట్టణంలోని తిరుపతిరెడ్డి కాలనీలో 11 ఏళ్లుగా కాపురం ఉంటున్న వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, బొప్పాపురం సమీపంలో సర్వే నెంబరు 181లో ఉన్న ప్రభుత్వ భూమి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. దానిపై తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ ధర్నాలో సీపీఐ నాయకులు రవికుమార్, కేశవ, రమణ, చెన్నయ్య, పీరయ్య, రేణుకమ్మ, విశ్వాసమ్మ, శ్రీనివాసులు, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

అధునాతన వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

అట్లూరు : రైతులు అధునాతన వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని బద్వేలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మండల పరిధిలోని కమలకూరు గ్రామంలో సోమవారం వికషిత కృషి సంకల్ప అభియాన్ పథకం ద్వారా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సురేష్‌రెడ్డి, గిరీష్, వెంకటసుబ్బయ్యతోపాటు హైదరాబాద్‌లోని భారతీయ నూనె గింజల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మంగేష్ దూబే పాల్గొన్నారు. వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు డ్రోన్ టెక్నాలజీతో పాటు చిరుధాన్యాల సాగు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచుట, పశుపోషణ, పశుగ్రాసం పెంపకం తదితర అంశాలపై రైతులకు వారు సమగ్రంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



డీటీ జాన్స్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య

బ్రహ్మంగారిమఠం : ప్రతి నిరుపేదకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు కూడా నిర్మించి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని సీపీఐ, ఏఐవైఎఫ్, నాయకులు సోమిరెడ్డిపల్లె నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెదులపల్లె ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆలసత్వంపై డిప్యూటీ తహసీల్దార్ జాన్స్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బి.మఠం మండలంలో గత ప్రభుత్వం జగనన్న కాలనీల కోసం కేటాయించిన స్థలాల్లో కొంతమంది ఇల్లు నిర్మించుకోలేదన్నారు. వారికి తక్షణం ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. అలాగే చాలామందికి ఇంటి స్థలాలు అవసరం ఉందన్నారు. అటువంటివారికి గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ వాసులకు 2 సెంట్లు ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చేజర్ల రవి, యువకులు లోకేష్, సుజన, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి

మైదుకూరు : పేదలకు ఇంటి స్థలాలను ఇవ్వాలని సోమవారం సీపీఐ నాయకులు తహసీల్దార్ రాజసింహ నరేంద్రను కోరారు. ఆ మేరకు వారు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ పేదలకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం, భూమిలేని పేద వ్యవసాయదారులకు ఒక హెక్టార్ ప్రభుత్వ భూమిని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.శ్రీరాములు, పోతిరెడ్డి భాస్కర్, ఆకుల వెంకట శివరాం, ఎస్.షావలి, బి.పీరయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకుడు పి.చేతన్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు తన ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులైన పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు, రెండు ఎకరాలు సాగు భూమి ఇస్తామని పేర్కొన్నారని తెలిపారు. సీఎం పదే పదే సభల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని మాటలు చెప్పడమే తప్ప ఆచరణలో భూ సర్వేలు కానీ, భూములు కొనుగోలు కానీ చేపట్టలేదన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై ఇంత వరకు పరిశీలనకు కూడా రెవెన్యూ యంత్రాంగాన్ని కూడా పంపలేదన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని, నూతనంగా పెంచమని ఇచ్చిన హామీకి నేడు తిలోదకం ఇచ్చిన ఘతన చంద్రబాబుదేనన్నారు. ప్రభుత్వ స్థలాల్లో 150 గజాలు ఆక్రమించుకున్న పేదలకు రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి జీఓలు విడుదల చేసి ఇంత వరకు జిల్లాలో అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, సభ్యులు ధనిరెడ్డి శివారెడ్డి, వై.హరి, మద్దిలేటి, యేసోబ్, ప్రమీల్, సుజాత, హుస్సేనమ్మ, చెన్నమ్మ, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్ పాల్గొన్నారు.

యోగాసనాలపై శిక్షణ



యోగాసనాలు చేస్తున్న ప్రజలు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం రోడ్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు యోగాసనాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వ తేదీ వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి సౌజన్యంతో యోగాలో ప్రజలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా యోగా డే వేడుకలు

చాపాడు : చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో సోమవారం అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు రఘు విద్యార్థుల చేత వివిధ రకాలైన యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకూ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 1990–91 సంవత్సరం పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎన్‌సీసీ విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు నడిగడ్డ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు దాణా పంపిణీ

కొండాపురం: మండల పరిధిలోని ఓబన్నపేట, కె.సుగుమంచిపల్లె పాడి రైతులకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ చేసినట్లు కొండాపురం పశువైద్యుడు రాజశేఖర్‌రాజు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి రైతులు ఆర్థికంగా మేరుగుపడేందుకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణా 700 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. పశువుల దాణా బస్తా ధర రూ.1110 అయితే 50శాతం సబ్సిడి పోను రైతుకు బస్తా రూ. 555 ధర ప్రకారం దాణా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పి. నాగేశ్వర్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.